క్లుప్తంగా

'దళితబంధు'తో ఆర్థికాభివృద్ధి సాధించాలి



యూనిట్‌ను ప్రారంభిస్తున్న బండ శ్రీనివాస్

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మడిపల్లి గ్రామంలో శనివారం లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, దళితబంధు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మూగల పర్శరాములు, ఉప సర్పంచ్ పోషిణి సత్యనారయణ, అంబాల ప్రభాకర్, సారబ్రదం, శ్రీనివాస్, శ్యామ్ పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి గ్రామశాఖ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన తాళ్లపల్లి అనిల్‌గౌడ్ నియామకమయ్యారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి అనిల్‌కు నియామకపత్రం అందజేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అనిల్ తెలిపారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చింతల రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలకేంద్రంలో 28న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కోరారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఇన్‌చార్జీలు సమ్మేళనంపై సన్నాహక సమావేశాలు నిర్వహించాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

రామడుగు: మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద శనివారం వైఎస్సార్‌టీపీ మండలశాఖ అధ్యక్షుడు దాసరి రవిశాస్త్రి ఆధ్వర్యంలో రైతులు, నాయకులు ధర్నా చేశారు. చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ మాట్లాడుతూ.. ఏప్రిల్ 2వ తేదీన పార్టీ ఆధ్వర్యంలో గంగాధరలో చొప్పదండి సంఘర్షణ సభను నిర్వహిస్తామని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మణ్, లచ్చయ్య, వెంకటేశం, జన్నయ్య,రాజు, అంజి, సుదర్శన్, బొందమ్మ, వెంకటేశం, లక్ష్మిరాజం పలువురు పాల్గొన్నారు.

ఆలోచనలతోనే ఆవిష్కరణలు

మానకొండూర్: ఆలోచనలతో ఆవిష్కరణలు సాధ్యమని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో శనివారం శివాని డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మూఢనమ్మకాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సులో మాట్లాడారు. మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని, దొంగస్వాములు, భూత వైద్యులు ఆర్థిక దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు సేవా దక్పథకంతో ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. అనంతరం సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ సతీశ్‌కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ నాగరాజు, అధ్యాపకు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలో 'ఆదర్శ'ం

- ఎన్ఎంఎంఎస్‌కు మోడల్ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థుల ఎంపిక
- ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్



రుక్మాపూర్ శివారులోని మోడల్ స్కూల్

చొప్పదండి: ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే పేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా, వారిలో చైతన్యం నింపి ఉన్నత విద్య దరి చేరేందుకు రూపొందించిన ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు రుక్మాపూర్ శివారులోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలో నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఏటా నిర్వహించే పరీక్షలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులు పరీక్షలో ప్రతిభ చూపితే ఏటా రూ.12,000 చొప్పున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా సాయం అందనుంది. మోడల్ స్కూల్ విద్యార్థులు స్కాలర్‌షిప్ సాధిస్తుండటంతో పలువురు తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని చూస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో ఇక్కడి విద్యార్థులు నెగ్గడం వారి ప్రతిభకు నిదర్శనం.

ప్రత్యేక తరగతులు

పాఠశాలలోని రెగ్యులర్ తరగతులతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థులు నెగ్గడానికి ఉపాధ్యాయ బృందం కృషి చేస్తోంది. పోటీ పరీక్షల్లో ఎటువంటి తప్పిదాలు చేయకుండా ముందస్తు సూచనలు చేస్తున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌పై ప్రత్యేక తరుగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక టీచర్‌ను నియమించి నెలల పాటు సాధన చేయిస్తున్నారు. ప్రశ్నల సాధన, వోఎంఆర్ షీట్లు నింపే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈఏడాది నిర్వహించిన పోటీ పరీక్షలో మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కోల రమేశ్

గతంలోనూ ప్రతిభ

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ గతం నుంచి కొనసాగుతోంది. ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో తొమ్మిది మంది ఎంపిక కాగా ఈసంఖ్య 13కు చేరింది. పాఠశాల నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డిప్లామా అండ్ స్పేస్ టెక్నాలజీ, న్యూఢిల్లీ వారి పోటీ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రూ.12 వేల ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. అంతే కాకుండా బాసర ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.

ప్రతిరోజూ సాధన



ఉపకార వేతనానికి నిర్వహించే పరీక్ష కోసం ప్రతిరోజూ సాధన చేశాను. సబ్జెక్టుల వారీగా ప్రతిరోజు టీచర్లు విపులంగా చెప్పడంతో పాటు ప్రత్యేక బోధన ఉపయోగపడింది. రివిజన్ చేసిన తరగతులు కూడా ఉపయోగపడ్డాయి. – ఎస్ శరణ్య, విద్యార్థిని

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



కేంద్ర ప్రభుత్వం ఏటా ఉపకార వేతనాలకు అవకాశం కల్పించడంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి పోటీ పరీక్షలో వచ్చే అంశాలపై అవగాహన కల్పించారు. – ఆర్. అర్జున్, విద్యార్థి

ఆనందంగా ఉంది



జాతీయ స్థాయి ఉపకార వేతనానికి ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. ప్రత్యేక ప్రణాళికతో టీచర్లు బోధించారు. అదనపు తరగతుల నిర్వహణతో గత ప్రవేశ పరీక్షల ఆధారంగా నోట్సు రాయించి సాధన చేయించారు. – ఎస్. అక్షయ, విద్యార్థిని

సమష్టి కృషితో ఫలితాలు



విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, వారికి స్కాలర్‌షిప్ అందించి విద్యలో ముందుకు తీసుకువెళ్లేందుకు సమష్టి కృషితో బోధన చేస్తూ ఫలితాలు సాధిస్తున్నాం. ఉపాధ్యాయుల సహకారంతో రోజు సాధనతో విజయం సాధ్యమైంది. – కోల రమేశ్, ప్రిన్సిపాల్

ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు.అనంతరం ప్రభుత్వ భూమిలో సీపీఐ జెండాలు పాతారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు, గూడెం లక్ష్మి ఆధ్వర్యంలో 18 ఎకరాల భూమిలో ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇళ్లు కట్టిస్తామని, బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. ఒక్కరికి కూడా ఇల్లు కట్టించలేదని ఆరోపించారు. ఇళ్ల స్థలాలు కేటాయించకుంటే భూపోరాటం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. బొమ్మకల్ మాజీ ఎంపీటీసీ ఒజ్జ కొమురయ్య, మిడిదొడ్డి కిరణ్, ఎల్లేశ్, సంజీవ్, భాగ్య, కిషోర్, సంపత్, భిక్షపతి ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

జమ్మికుంట: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమించాలని హుజూరాబాద్ నియోజకవర్గ భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) గౌరవ అధ్యక్షుడు పొనగంటి మల్లయ్య అన్నారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. రాష్ట్రంలో కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని, కేంద్రం కార్మికుల హక్కులను హరిస్తోందని, లేబర్ కోడ్ బిల్లులను కుదించి, కార్మిక లోకానికి నష్టం చేస్తుందన్నారు. 26న కరీంనగర్‌లో నిర్వహించే బీఆర్‌టీయూ సమ్మేళన సభకు అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో మండలం సస్యశ్యామలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గం హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని గొడిశాలలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టుతో మండలాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. అన్ని గ్రామాలకు రోడ్లు వేశామని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విమర్శలను తిప్పికొట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గుజ్జులపల్లి శివాలయానికి రోడ్డు, గొడిశాలలో గ్రంథాలయానికి నిధులు మంజూరు చేయిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో సతీశ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కోరారు. మరోవైపు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని పలు గ్రామాల బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మన్లు వెంకటరెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, వొడితెల ఇంద్రనీల్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ చింత లత, ఎంపీటీసీ భాగ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాములు, సింగల్ విండో మాజీ చైర్మన్ జున్నూతుల భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలపై సర్వే నిర్వహించాలి



అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో ఎమ్మెల్యే

గంగాధర: అకాల వర్షాలతో ధ్వంసమైన పంటలపై సర్వే నిర్వహించి నివేదిక తయారు చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో శనివారం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్ చొప్పదండి నియోజకవర్గంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారని, నష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేలు ప్రకటించారని గుర్తుచేశారు. నివేదికలు ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం మంజూరు చేయిస్తానని, నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని, పరిహారం అందించి ఆదుకుంటామన్నారు.

అంగన్‌వాడీలకు అండగా ఉంటాం

అంగన్‌వాడీ సిబ్బందికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శనివారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. తెలంగాణ వచ్చాక టీచర్లు, సిబ్బందికి గౌరవం దక్కిందని, గౌరవ వేతనాలు సైతం పెంచామన్నారు. అంగన్‌వాడీలో పనిచేసే మహిళలకు గృహలక్ష్మి పథకం కింద డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామన్నారు. పార్టీకి అండగా నిలువాలని కోరారు.

అభివృద్ధికి అడ్డొస్తే చర్యలు



పనులు పరిశీలిస్తున్న గుర్రం నీరజ

చొప్పదండి: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ పనులు పూర్తికావస్తున్నాయని, త్వరలో ఓపెన్ జిం ప్రారంభిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్‌తో కలిసి శనివారం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అభివృద్ధి పనులు అడ్డుకుంటే, జిమ్ పరికరాలు ధ్వంసం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైదానంలో వాకింగ్ చేసేవారికి జిమ్ అందుబాటులోకి రానుందని రూ.15 లక్షలతో నిర్మిస్తున్నామని తెలిపారు. నిర్మాణానికి సహకరించిన జర్నలిస్టులు, వాకర్స్ క్లబ్ సభ్యులకు, స్థానిక యువతకు కృతజ్ఞతలు తెలిపారు. వెంట మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ అంజయ్య, కొత్తూరి నరేశ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జంగ వెంకట్‌రమణారెడ్డి

చిగురుమామిడి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) రుణాలను రైతులు సద్వినియోగంచేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకట్‌రమణారెడ్డి కోరారు. శనివారం సంఘం వార్షిక మహాసభలో మాట్లాడారు. 3,374 మంది సభ్యులున్నారని, 830 మంది రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాల కింద రుణాలు ఇచ్చామని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి కోళ్లఫాం, డైయిరీ, ఇతర వ్యాపార వాణిజ్య అవసరాలకు రుణాలు ఇస్తున్నామని, సంఘం లాభాల బాటలో నడుస్తోందన్నారు. చిగురుమామిడి, బొమ్మనపల్లి, రేకొండ, ఇందుర్తి గ్రామాల్లో ఎరువులు తక్కువ రేటుకు అందుబాటులో ఉంచుతామన్నారు. సీఈవో నర్సయ్య గత సంవత్సరం ఆదాయ, వ్యయాలను, ప్రస్తుత బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. మహాసభలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామోజు రజితకృష్ణమాచారి, డైరెక్టర్ కైలాసం, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ తిరుపతి, డైరెక్టర్లు తిరుపతి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచుల వినతి



వినతిపత్రం అందిస్తున్న ఉపసర్పంచులు

రామడుగు: గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల సమాచారం అధికారులు ఉపసర్పంచులకు ఇవ్వడంలేదని, మండల ఉపసర్పంచుల సంఘం నాయకులు రాపోలు అంజయ్య, మేడి శ్రీనివాస్‌గౌడ్, వడ్లూరి రాజేందర్, ముచ్చంతల నరేందర్‌రెడ్డి, ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రాను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కార్ అవార్డు గెలుచుకున్న గ్రామ పంచాయతీల సన్మాన కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం సరికాదని తెలిపారు. కేవలం చెక్కులపై సంతకాలు చేయడానికే పనికొస్తున్నామని విన్నవించారు.

సంక్షిప్త వార్తలు

రిజ్వాన్ కుటుంబానికి ఆర్థిక సాయం

వీణవంక: మండల కేంద్రానికి చెందిన 108 ఉద్యోగి రిజ్వాన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి తోటి స్నేహితులు, ప్రజాప్రతినిధులు కలిసి రూ.1.22 లక్షల ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ నీల కుమార్ చేతుల మీదుగా చెక్కును అందించారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

వీణవంక: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని శాసన మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. వల్భాపూర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఖాసీంపేటలో నాగపంచమి షూటింగ్

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీ మానసాదేవి ఆలయంలో నాగపంచమి సీరియల్‌కు సంబంధించి షూటింగ్‌ను నిర్వహించారు. 27 నుంచి సీరియల్ ప్రారంభమవుతోందని దర్శక,నిర్మాతలు తెలిపారు.

కార్పొరేట్ సంస్థలకు దేశ సంపద

జమ్మికుంట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపద దోచిపెడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యలయంలో జోన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు.

తైబజార్ వేలం వాయిదా

జమ్మికుంట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 2023–24 ఆర్థిక సంవత్సరం జమ్మికుంట తైబజార్ వేలంపాటను మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గతేడాదికంటే తక్కువ వేలం రావడంతో వాయిదా వేశారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్ :మండలంలోని సిర్సపల్లి గ్రామంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.ఇందిరాదేవి తెలిపారు. 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొంటారని శిబిరం 31 వరకు కొనసాగుతుందన్నారు.

నష్టపరిహారం అందించాలి

గన్నేరువరం: పొద్దు తిరుగుడు పంటపై అధికారులు సర్వే చేపట్టి నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు. పంట నష్టంపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. పారువెల్లలో పొద్దుతిరుగుడు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

చిగురుమామిడి: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ కొత్త వినీతఅన్నారు. శనివారం చిగురుమామిడిలోని కేజీబీవీలో న్యూట్రిషియన్ కిట్స్, రాగి లడ్డూలను జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ తో కలిసి పంపిణీ చేశారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని రామంచ సర్పంచ్ గుంటి మాధవితిరుపతి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌పక్వాడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రామడుగు: మండలంలోని వెదిరలో చిరుధాన్యాలపై అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

చొప్పదండి:మండలంలోని గుమ్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు నచ్చిన పిండి వంటకాలు, పండ్లు, కూరగాయలు ప్రదర్శనలో ఉంచారు.

మానకొండూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ చిన్నారులతో ర్యాలీలు చేపట్టారు. ఖాదర్ గూడెంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాలలో కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న మామిడి అంజయ్య

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామానికి చెందిన ఎర్రోజు చంద్రయ్యాచారి కుటుంబానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య శనివారం రూ.పదివేలు అందించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అందించామని, ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు మక్బుల్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



గన్నేరువరం: దిష్టిబొమ్మ దహనంచేస్తున్న నాయకులు

రాహుల్ గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు ధర్నా, నిరసనలు చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజల నుంచి వచ్చిన ఆదరణ ఓర్వలేకనే బీజేపీ ప్రభుత్వ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ శివారులోని గుట్ట వద్ద శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆదివారం గుట్ట సమీపంలో బండ్ల జాతర నిర్వహిస్తామని, అనంతరం స్వామి వారి ఊరేగింపు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ పునఃనిర్మాణ కమిటీ



నూతన కమిటీ సభ్యులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం వేణుగోపాలస్వామి ఆలయం పునః నిర్మాణ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుర్రం రామస్వామి, అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా భూపతినాగభూషణం, జునువాల రాజమల్లు, మోత్కూరి సమ్మయ్య, గొడిశాల రాములు, ప్రధానకార్యదర్శిగా గోప్ప శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా తనుకు ప్రభాకర్, సలహాదారులుగా తనుకు ఓంకారం, పాలడుగుల బాబన్న, కర్మకొండ రాజయ్య, పాలడుగుల సోమేశ్వర్, గొల్లపల్లి జ్యోతి, కార్యదర్శులుగా కొత్తపల్లి రవి, గొడిశాల సదానందం, తనుకు వాసు,భూపతి రవికుమార్, సహాయకార్యదర్శులుగా గొల్లపల్లి వెంకటేశ్వర్లు, సముద్రాల సంపత్, కల్లెపల్లి క్రాంతికుమార్, ప్రచార కార్యదర్శిగా బొజ్జ చంద్రమౌళి, సభ్యులుగా భూపతి ప్రసాద్, బొంగోని శ్రీనివాస్, తనుకు శ్రీనివాస్, పూరెళ్ల ప్రశాంత్, చెరుకు వెంకటేశ్, బొంగోని మధు, మండ ప్రభాకర్, శ్రీరాం ప్రభాకర్ ఎన్నికయ్యారు.

సిర్సపల్లి సర్పంచ్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీవో

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామ పంచాయతీకి ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారానికి ఎంపికైంది. ఈసందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్పంచ్ ఎడ్ల సువర్ణ సునీయంను ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి సన్మానించారు.